సాక్షి
నంద్యాల
మంగళవారం : 16 : జూలై : 2024



మహానందిలో భక్తుల రద్దీ

మహానంది: మహానంది ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. సోమవారం క్యూలైన్లు కిక్కిరిసి కనిపించాయి. ఆలయ మాడవీధుల్లో భజన కార్యక్రమాలు నిర్వహించారు.



రూ.13.90లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్ మల్కాజ్‌గిరికి చెందిన స్వయంపాకుల లక్ష్మీనారాయణ కుటుంబసమేతంగా రూ.13.90 లక్షల విరాళాన్ని అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,608.5
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 34
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 16,142
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 211

న్యూస్‌రీల్

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్ డౌన్

- నాలుగు రోజులుగా అందని సేవలు



సర్వర్ నిలిచి పోవడంతో బయట వేచి ఉన్న క్రయవిక్రయదారులు

నంద్యాల(అర్బన్): జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నాలుగు రోజులుగా సర్వర్లు పని చేయడం లేదు. దీంతో క్రయవిక్రయదారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. సర్వర్లు ఎప్పుడు పని చేస్తాయో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేశారు. క్రయవిక్రయదారుల ఆధార్ నంబరు ఆధారంగా చేసుకొని ఆన్‌లైన్‌లో ఈకేవైసీ, ఈ సైన్‌ల ద్వారా భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఢిల్లీలోని యూఐడీఏఐ నెట్‌వర్కింగ్ సర్వర్‌లో సాంకేతిక సమస్యలతో ఆధార్ సర్వర్ డౌన్ అయ్యింది. దీంతో ఆధార్‌ను అనుసంధానం చేస్తూ సాగే భూముల రిజిస్ట్రేషన్ల సేవలకు ఆటంకం ఏర్పడుతోంది.

ఎండు మిర్చి క్వింటా రూ.15,000

నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని మిర్చి యార్డుకు సూపర్-10 సరకు రకం అమ్మకానికి వచ్చింది. క్వింటా గరిష్ట ధర రూ.15,000, మధ్యస్థ ధర రూ.12,700, కనిష్ట ధర రూ.9,200 పలికినట్లు యార్డు ఎంపిక శ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలు దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారుల వద్ద సరకు అమ్ముకొని మంచి ధరను పొందాలని సూచించారు.

జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న శివయ్య

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన సీపీఎస్‌ను రద్దు చేసి, దాని స్థానంలో జీపీఎస్ అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ శివయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షకు వ్యతిరేకంగా బలవంతంగా తీసుకు వచ్చిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌ను ఏపీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. రాష్ట్రంలో అన్ని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, భాస్కరరెడ్డి, వీరేశ్వరరెడ్డి, తిమ్మారెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం చోరీ

ఆళ్లగడ్డ: పట్టణంలోని గోకులకృష్ణ ఆలయంలో సోమవారం చోరీ జరిగింది. ఎస్ఐ నగీన తెలిపిన వివరాల మేరకు.. ఆలయ ఆవరణలో ఎవరూ లేని సమయంలో స్వామి వారి కిలో బరువుండే వెండి కిరీటాన్ని దొంగలు తీసుకెళ్లినట్లు చెప్పారు. సాయంత్రం పూజారి వెళ్లగా తాళాలు పగులగొట్టిన విషయం గనమించి పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

బాబు.. భృతి మరుపు!

- నెల రోజులు దాటినా ఖరారు కాని విధివిధానాలు
- ప్రభుత్వంపై నమ్మకంతో స్టడీ సెంటర్లలో చేరిన యువకులు
- ఉద్యోగం వచ్చేవరకు ఒక్కొక్కరికి రూ. 3 వేలు ఇస్తామన్న హామీపై శ్రద్ధ చూపని ముఖ్యమంత్రి
- గతంలోనూ రూ.2 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని మాట తప్పిన చంద్రబాబు
- ఈ సారి తమ జీవితాలతో చెలగాటమాడొద్దంటూ నిరుద్యోగుల విన్నపం

ఉజ్వల భవిష్యత్తు కోసం కష్టపడి చదివారు.. డిగ్రీలు, పీజీలు చేశారు.. కొందరు ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నారు.. మరికొందరు కుటుంబానికి ఆసరాగా ఉంటూ కూలీ పనులకు వెళ్తున్నారు.. ఇలాంటి వారిలో ఆశలు కల్పిస్తూ.. ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు నిరుద్యోగభృతి హామీ ఇచ్చారు. ఉద్యోగం వచ్చేంత వరకు యువతకు నెలనెలా రూ.3వేలు ఇస్తామని వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చి నెల రోజులైంది. ఇప్పటి వరకు నిరుద్యోగ భృతిపై ఒక్క మాట కూడా లేదు. దీంతో యువత ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో నిరుద్యోగులు: 5.95 లక్షలు

వీరికి నెలకు చెల్లించాల్సిన నిరుద్యోగ భృతి: రూ.178.5 కోట్లు



నంద్యాల(సిటీ): ఉచిత ఇసుక, తల్లికి వందనం పథకాల అమలుపై ఇప్పటికే నాలుకమడతపెట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్ సిక్స్‌లోని మరో ప్రతిష్టాత్మకమైన పథకం నిరుద్యోగ భృతి అమలును గాలికొదిలేసినట్లే కనిపిస్తోంది. అధికారంలోకి వచ్చి నెల రోజులైనా ఈవిషయంపై నోరు మెదపక పోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో నారా లోకేష్, పవన్ కల్యాణ్, టీడీపీ నేతలు.. 'ఉద్యోగం వచ్చే వరకు ప్రతి ఒక్కరూ నెలనెలా రూ. 3 వేలు నిరుద్యోగ భృతి అందుకోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలి.. 20 లక్షల ఉద్యోగాలు రావాలంటే.. మరోసారి బాబు రావాలి' అని ఊరూరా ఊదరగొట్టారు. ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. మ్యానిఫెస్టోలో సైతం ఈ అంశాన్ని పొందుపరిచారు.

మోసం.. బాబు నైజం

చంద్రబాబు నాయుడు గతంలో మూడుసార్లు సీఎంగా పనిచేశారు. బూటకపు హామీలతో ఇప్పుడు నాలుగోసారి గద్దెనెక్కారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో హామీలను చెప్పింది చెప్పినట్లు అమలు చేయలేదు. 2014 ఎన్నికల సమయంలో కూడా నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 2వేలు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారు. యువత నుంచి వ్యతిరేకత రావడంతో ఎన్నికలకు ఆరు నెలల ముందు చాలా కొద్ది మందికి మాత్రమే తూతూ మంత్రంగా నిరుద్యోగ భృతిని అందజేశారు. అదే సీన్ మరోసారి రిపీట్ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. అయితే యువత మాత్రం తమను మోసం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు. చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్, బీజేపీ పెద్దలు కూడా ఉమ్మడిగా ఇచ్చిన మేనిఫెస్టోను నమ్మి ఓట్లు వేశామని, కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లో పనులు మానుకొని స్టడీ సెంటర్లలో చేరి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నామని వెంటనే నిరుద్యోగ భృతి ఇచ్చి తమకు చేదోడు అందించాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా నిలిచింది. జిల్లాలో 516 గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. వీటిల్లో 3,930 మంది యువతీ, యువకులకు ఉద్యోగాలు ఇచ్చింది. అంతేకాకుండా చాలీచాలని వేతనాలతో బతుకు నీడుస్తున్న కాంట్రాక్టర్ల కింద పని చేసే కార్మికులకు విముక్తిని కల్పిస్తూ, కాంట్రాక్ట్ పద్ధతికి స్వస్తి చెబుతూ సరికొత్త వ్యవస్థను తెచ్చింది. ఉద్యోగ భద్రతతో పాటు వేతనంలో మార్పు చేసి కాంట్రాక్టర్ల బారి నుంచి తప్పించి సిబ్బందికి నిర్ణీత వేతనంతో జీవితాలను మార్చింది. అంతే కాకుండా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఐదు సంవత్సరాల వైఎస్సార్‌సీపీ హయాంలో మూడు వేలకు పైగా నియామకాలు చేపట్టింది. ఇందులో రూ.15వేల గౌరవ వేతనం నుంచి స్పెషలిస్టు వైద్యులకు అధికంగా రూ.1.40లక్షలు నెలకు జీతభత్యాలను అందించింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

నంద్యాల జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. జనాభా లెక్కల ప్రకారం 2011లో 17.82 లక్షల మంది ఉండగా.. ప్రస్తుతం వీరి సంఖ్య 18.72 లక్షలకు చేరుకుంది. జిల్లాలో మొత్తం 5.95 లక్షల కుటుంబాలు ఉండగా అంతే మొత్తంలో నిరుద్యోగులు ఉన్నట్లు అంచనా. వీరిలో చాలా మంది డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు ఉన్నారు. ఇంటర్, 10వ తరగతి చదివి పోలీస్, ఆర్మీ, నేవీ, రైల్వే తదితర ప్రభుత్వ ఉద్యోగాల కోసం పట్టణాల్లో కొందరు శిక్షణ తీసుకుంటున్నారు. వీరంతా నిరుద్యోగ భృతి కోసం వెయ్యికళ్లతో ఎదురుచూస్తున్నారు.

ఐదేళ్లు అమలు చేయాలి



ప్రస్తుతం ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నా. కూలీ పనులు చేసుకుంటున్నా. ఎన్నికల ప్రచారంలో ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇస్తాం, లేని పక్షంలో నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తామని చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నారా లోకేష్ మాటిచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల అవుతున్నా నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. గతంలో కూడా నిరుద్యోగ భృతి కింద రూ.2వేలు ఇస్తామని చెప్పి రెండు సార్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ఐదేళ్ల పాటు అమలు చేసి తీరాలి.

– శ్రీనివాసులు,పెట్నికోట, కొలిమిగుండ్ల మండలం

ఆశలు పెట్టుకున్నాం



నిరుద్యోగ భృతిపై ఎంతో ఆశలు పెట్టుకున్నాం. కూటమి ప్రభుత్వం వస్తే నెలనెలా ఖర్చులకు ఇబ్బందులు ఉండవనుకున్నాం. టీడీపీ అధికారంలోకి వచ్చి నెల రోజులైంది. ఇప్పటి వరకు నిరుద్యోగుల గురించి పట్టించుకోలేదు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇచ్చిన హామీపై దృష్టి సారించలేదు. నేను ప్రభుత్వ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. కోచింగ్ సెంటర్లలో చదువుకునేందుకు చాలా ఖర్చు వస్తోంది. మా బాధలను గుమనించి వెంటనే నిరుద్యోగ భృతి విడుదల చేయాలి.

–మురళీమోహన్, నంద్యాల

మరోసారి మోసపోతామేమో!



అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు ఉలుకుపలుకు లేదు. నేను డిగ్రీ చదువుకొని ఎలాంటి ఉపాధి లేక ఇంటి వద్దనే ఉన్నాను. భృతి వస్తే స్టడీ సెంటర్‌లో చేరి చదువుకు కోవడవానికి వీలుంటుంది. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. అయితే గతంలో గతంలో మాదిరిగా మరోసారి మోసం చేస్తారేమో అని భయంగా ఉంది.

–రామ్‌నాథ్‌రెడ్డి, దొర్నిపాడు

ఉపాధి పనులకు వెళ్తున్నా



నేను 2011లో డిగ్రీ, 2013లో బీఈడీ పూర్తి చేశాను. ఉద్యోగం రాకపోవడంతో గ్రామంలో ఉపాధి కూలీ పనులకు వెళుతున్నా. టీడీపీ మేనిఫేస్టోలో నిరుద్యోగ భృతి లేదంటే ఇంటికి ఓ ఉద్యోగం ఇస్తామన్నారు. ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నాం. నిబంధనలు విధించి నిరుద్యోగ భృతికి కోత వేయకుండా మాలాంటి వారందరికీ వర్తింపజేయాలి. దీనిపై వీలైనంత త్వరగా స్పష్టత ఇవ్వాలి.

– దమాల చందు, బుక్కాపురం, మహానంది మండలం

చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించం

- నూతన ఎస్పీగా అధిరాజ్‌సింగ్‌రాణా బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగించి చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా, అది పోలీసులైనా సరే ఉపేక్షించేది లేదని నూతన ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా హెచ్చరించారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పోలీస్ ఉన్నతాధికారులు తనపైఎం నమ్మకంతో నంద్యాల జిల్లా బాధ్యతలు అప్పగించారన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందుతానని తెలిపారు. జిల్లాలో గంజాయి, అక్రమ మద్యం రవాణా కట్టడి చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

పని చేయాలని ఉందా.. లేదా?

- చాగలమర్రి తహసీల్దార్‌పై జేసీ ఆగ్రహం

చాగలమర్రి: 'పని చేయాలని ఉందా. లేదా?' అంటూ చాగలమర్రి తహసీల్దారు రమణమ్మపై జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు చాగలమర్రి మండలంలోని రాంపల్లె గ్రామానికి చెందిన గుశ్వేసాబు అనే వ్యక్తి వెళ్లారు. తన పొలం 23 సెంట్లు విస్తీర్ణం తక్కువగా ఆన్‌లైన్‌లో నమోదైందని, సమస్యను పరిష్కరించవలసినదిగా పలుమార్లు తహసీల్దార్‌కు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఫిర్యాదు చేశారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మీరు పనిచేస్తున్నారా.. లేదా' అని మండి పడ్డారు. అనంతరం నంద్యాల ఆర్డీఓకు సమస్యను పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. దీంతో ఆర్డీఓ తహసీల్దారు రమణమ్మను నంద్యాలకు రావలసిందిగా ఆదేశించారు. సమస్యకు సంబంధించిన విషయాన్ని ఈ-మెయిల్ ద్వారా ఆర్డీఓ కార్యాలయానికి సమాచారాన్ని అందజేశారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా బద్వేలు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న రమణమ్మకు పదోన్నతి కల్పించి చాగలమర్రి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఎన్నికల సమయంలో రావడంతో కార్యాలయంలో ఎలాంటి రెవెన్యూ రికార్డులకు సంబంధించి పనులు చెయ్యడం లేదని మండల ప్రజలు,ఆరోపిస్తున్నారు. త్వరగా బదిలీలు జరిగితే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదని భావిస్తున్నారు.

'ఉపాధి'లో కోటి పనిదినాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి, చిత్రంలో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు

నంద్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 76 లక్షల పని దినాలు లక్ష్యం ఇవ్వగా ఇప్పటి వరకు 46 లక్షల పనిదినాలు కల్పించారని, కేటాయించిన లక్ష్యాన్ని అధిగమించి కోటి పని దినాలు కల్పించే దిశలో డ్వామా అధికారులు, ఎంపీడీఓలు పని చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాల్‌లో ప్రజా సమస్య పరిష్కార వేదికలో భాగంగా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పద్మజ, జిల్లా అధికారులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఉపాధి హామీ దినసరి సగటు వేతనం 239 రూపాయలకు మించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.300 మంజూరు చేసినప్పటికీ ఆ మేర పనులు కల్పించడంలో విఫలమవుతున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలాఖరులోగా ఉపాధి సగటు దినసరి వేతనాన్ని రూ.250 అధిగమించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి వేతన మంజూరులో రాష్ట్రంలోనే జిల్లా దిగువ నుంచి మూడో స్థానంలో ఉందన్నారు. ఫీడర్ చానళ్లు, ఫాంఫాండ్ పనులు కల్పించి దినసరి వేతనం పెంచాలన్నారు. జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి అనుకూలంగా ఉందని, మొక్కల పెంపకాన్ని ఉపాధి హామీ కింద చేపట్టాలని ఆమె పేర్కొన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బంది లేకుండా అవసరమైన విత్తనాలు, రసాయనిక ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. కౌలు రైతుల కార్డులు 22,780 గాను రెన్యువల్స్ 9.8 శాతం మాత్రమే అయ్యాయని, 130 కోట్ల రుణాలు ఇవ్వాల్సిన నేపథ్యంలో ఈ నెలాఖరులోగా కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్నం భోజన పథక అమలు పనితీరు పర్యవేక్షించి నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు.

18 నుంచి కుష్టు రోగుల గుర్తింపు

ఈ నెల18 నుండి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్లో జాతీయ కుష్ఠి వ్యాధి నిర్మూలన కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో పద్మజ, ఇతర వైద్యాధికారులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించే విధానంపై ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. సర్వేలో 1,610 బృందాలు (బృందంలో ఆశా కార్యకర్త, మేల్ వలంటీర్ ఉంటారు)పాల్గొంటాయని తెలిపారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్ – టీబీ అధికారి యం.శారద బాయి మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి నివారణ మందులు ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా లభిస్తాయని తెలిపారు.

బాలిక ఆచూకీపై హైకోర్టులో రిట్‌పిటిషన్

- న్యాయవాదుల ఏకగ్రీవ తీర్మానం



పడమర ప్రాతకోటలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన



ఏకగ్రీవంగా తీర్మానం చేసిన న్యాయవాదులు

నందికొట్కూరు: పగిడ్యాల మండలం కొత్త ఎల్లాల గ్రామంలో తొమ్మిది రోజుల క్రితం అదృశ్యమైన బాలిక ఆచూకీ తెలుసుకునేందుకు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలని న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం వారు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరాముడు మాట్లాడుతూ.. బాలిక ఆచూకీ కనిపెట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేకూరడం లేదన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడమే ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. బాలిక అదృశ్యంలో ప్రభుత్వం మౌనం వహించడం వెనక రాజకీయ నాయకుల ప్రమేయం ఏమైనా ఉందా అనే ప్రశ్నలు వస్తున్నాయన్నారు. నిందితులుగా భావిస్తున్న వారికి లైడిటెక్టర్ పరీక్షలు నిర్వహించి సమాచారం రాబట్టాలన్నారు. అనంతరం బాలిక కుటుంబాన్ని న్యాయవాదులందరూ పరామర్శించారు.

ప్రభుత్వం విఫలం

అదృశ్యమైన బాలిక ఆచూకీ కనిపెట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం నాయకులు భాస్కరరెడ్డి, ఫక్కీర్‌సాహెబ్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. తల్లిదండ్రులకు బాలికను కడసారి చూపు చూసుకునే అవకాశం లేకుండా చేశారన్నారు. బాధిత కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియోతో పాటు ఐదు ఎకరాల భూమిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాలికలపై, చిన్నారులపై, మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయన్నారు. బాలిక కుటుంబానికి సరైన న్యాయం జరగకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, వేణుగోపాల్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

పగిడ్యాల: బాలిక అదృశ్యం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ డిమాండ్ చేశారు. సోమవారం పడమర ప్రాతకోట గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాలిక ఆచూకీ కనిపెట్టకపోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. డీఐజీ, ఎస్పీ స్థాయి అధికారులు కూడా నిందితుల నుంచి అసలు నిజం రాబట్టలేకపోవడం దురదృష్టకరమన్నారు. ఘటనకు బాధ్యులైన ముగ్గురు మైనరు బాలురు, వారి తల్లిదండ్రులను చట్టపరంగా శిక్షించి బాధిత తల్లిదండ్రులను ఆదుకోవాలన్నారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

సోమవారం కొత్త ఎల్లాల గ్రామంలోని మైనర్ బాలిక బాధిత కుటుంబానికి డిప్యూటీ తహసీల్దార్ రవి 50 కేజీల ప్రభుత్వ చౌకబియ్యం, ఐదు కేజీల చక్కెర అందజేశారు. అలాగే డీఈఓ ఆదేశాల మేరకు మండల విద్యాధికారులు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పెద్ద కూతురిని పగిడ్యాలలోని కస్తూర్బావిద్యాలయంలో చేర్పించారు. కుమారుడిని ఐదో తరగతి అనంతరం జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో చేరిస్తామని హామీ ఇచ్చారు. తొమ్మిది రోజుల అనంతరం మండల స్థాయి అధికారులు ఆలస్యంగా స్పందించారని స్థానికులు విమర్శించారు.

శ్రీశైలం ఈఓగా ఐఏఎస్ అధికారి?



శ్రీశైల దేవస్థాన పరిపాలనా భవనం

శ్రీశైలంటెంపుల్: రాష్ట్రంలో రెండో అతిపెద్ద పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి పరిపాలనాధికారిగా ఐఏఎస్ అధికారిని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం ఇద్దరు, ముగ్గురు పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అష్టాదశ శక్తిపీఠం, ద్వాదశ జ్యోతిర్లింగం కలిసి వెలసిన శ్రీశైల మహాక్షేత్రంలో రోజురోజుకు భక్తుల రద్దీ గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం దేవస్థాన పరిపాలనాధికారిగా డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారి ఉన్నారు. ఆయన ద్వారా అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో క్షేత్రంలో నూతన క్యూకాంప్లెక్స్, సాలు మండపాలు, శివసేవకుల వసతి సముదాయం, 200 గదుల సముదాయం, సోలార్ ప్లాంట్, క్షేత్ర సరిహద్దుల ప్రహరీ..తదితర పనులతోపాటు రూ.215కోట్లతో పలు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. క్యూకాంప్లెక్స్, సాలు మండపాలకు మాత్రమే టెండర్లు పూర్తయ్యాయి. మిగిలిన పనులకు టెండర్లు పిలవలేదు. ఇంతలో సాధారణ ఎన్నికలు రావడంతో టెండర్ల ప్రక్రియ వాయిదా పడింది. ప్రస్తుతం ఆయా పనులతో పాటు క్షేత్రంలో 104 పనులకు సైతం రూ.12కోట్లతో ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచారు. ఆయా పనులు ఈ నెల చివరిలో ప్రారంభం కానున్నాయి.

ఐఏఎస్ అధికారితో అభివృద్ధి వేగవంతం

శ్రీశైల దేవస్థానంలో టెండర్లకు సిద్ధంగా ఉన్న ఆయా పనులను సకాలంలో, సమర్థవంతంగా పూర్తి చేయాలంటే సమర్థుడైన అధికారి కావాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఈఓగా పనిచేసిన ఐఏఎస్ అధికారి డాక్టర్ భరత్‌గుప్తాకు అప్పటి ప్రభుత్వం కమిషనర్ స్థాయి అధికారాలు ఇవ్వడంతో సుమారు రూ.136కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రస్తుతం కూడా ఐఏఎస్ అధికారిని నియమించి ఆయనకు విస్తృత అధికారులు ఇచ్చి క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ స్థాయి అధికారి (ఈఓ) కు రూ.10లక్షలు మాత్రమే పరిపాలనా అనుమతులు ఇచ్చేందుకు అవకాశం ఉంది. రూ.10లక్షలు దాటితే కమిషనర్ అనుమతి తప్పనిసరి. అదే ఐఏఎస్ అధికారికి విచక్షణాధికారాలు ఇస్తే కమిషనర్ స్థాయి అధికారాలు ఉంటాయి కాబట్టి క్షేత్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందనే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. గతంలో దేవస్థాన ఈఓలుగా విధులు నిర్వహించిన ముగ్గురు అధికారులు ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఒక అధికారి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని స్వయంగా వచ్చి కలిసినట్లు, మరో ఇద్దరు అధికారులు ఫోను ద్వారా టచ్‌లో ఉన్నట్లు సమాచారం.

క్లుప్తంగా

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ



స్వామివారి పల్లకీని ఊరేగిస్తున్న భక్తులు

మహానంది: కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు శరభయ్యశర్మ, తదితరులు అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకారపూజ, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

30 టన్నుల ఇసుక సీజ్

కర్నూలు (టౌన్): అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను అధికారులు సీజ్ చేశారు. కోసిగి మండలం శాతనూరు గ్రామంలో అనుమతులు లేకుండా హిటాచి ద్వారా పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం రెవెన్యూ, సెబ్, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేశారు. అక్రమంగా నిల్వ చేసిన 30 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. అలాగే హిటాచి వాహనాన్ని కోసిగి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు. అక్రమంగా ఇసుకను నిల్వ చేస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా స్విమ్మర్ల ప్రతిభ





దేవ్‌శృత్‌సాయి, వెర్షిక

కర్నూలు కల్చరల్: కర్నూలు డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో జిల్లా స్విమ్మర్లు సత్తా చాటారు. కర్నూలు డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 13, 14 తేదీల్లో జరిగిన 9వ సబ్ జూనియర్, జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలుకు చెందిన ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి వై.దేవ్‌శృత్‌సాయి గ్రూప్ –1 విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 400 మీటర్ల ఇండివ్యువల్ మిడ్లే ఈవెంట్లలో ద్వితీయ స్థానంలో నిలిచి మూడు వెండి పతకాలు, 400 మీటర్ల ఫ్రీ స్టైల్, 200 మీటర్ల ఇండివ్యువల్ మిడ్లే ఈవెంట్లలో తృతీయ స్థానంలో నిలిచి రెండు కాంస్య పతకాలు సాధించారు. అదేవిధంగా నగరంలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని టి.వెర్షిక గ్రూప్ –3 విభాగంలో 50 మీటర్ల బటర్ ఫ్లై ఈవెంట్‌లో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం, 100 మీటర్ల బటర్ ఫ్లై ఈవెంట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకం సాధించి సత్తా చాటింది. మెడల్స్ సాధించిన క్రీడాకారులను డీఎస్‌డీఓ భూపతిరావు, స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు అభినందించారు.

గరుడ వాహనంపై ప్రహ్లాదవరదుడు

- ఘనంగా నృసింహ జయంతి మహోత్సవం
- స్వామివారి నిజరూప దర్శనంతో భక్తుల తన్మయత్వం



ఉత్సవమూర్తులను జ్యేష్టాభిషేకాలకు ముస్తాబు చేస్తున్న అర్చకులు



గరుడ వాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో సోమవారం శ్రీలక్ష్మి నృసింహస్వామి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేకువ జామునే దిగువ అహోబిలంలో వెలసిన మూలమూర్తులు ప్రహ్లాదవరద స్వామి, అమృతవల్లీ అమ్మవార్లను సుప్రభాత సేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్య పూజలతో పాటు స్వాతి నక్షత్ర ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

వైభవంగా పెరియశ్వార్ తిరునక్షత్రోత్సవం

స్వామి జయంతిని పురస్కరించుకుని పెరియాళ్వార్ తిరునక్షత్ర వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదవరద స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై అధిష్టించగా మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

శాస్త్రోక్తంగా జ్యేష్టాభిషేకం (అభిద్యేయక అభిషేకం)

దిగువ అహోబిలంలో జ్యేష్టాభిషేకం (అభిద్యేయక అభిషేకం) వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరద స్వాములను కొలువుంచి వేద పండితుల వేదమంత్రోచ్ఛరణలతో 108 కలశాలతో కూడిన విశేష తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించి జ్యేష్టాభిషేకం పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి స్వయం తిరుమేనితో దర్శనమివ్వడంతో భక్తులు దర్శించుకుని తన్మయత్వం చెందారు.

జ్యేష్టాభిషేకం విశిష్టత

స్వామికి ఏటా జ్యేష్ట మాసంలో మూడు రోజుల పాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహించడం ఆనవాయితీ. పురాతన కాలం నాటి ఉత్సవమూర్తులు నిరంతర అభిషేకాలతో అరుగుదలకు లోనవుతాయి. వాటిని పరిరక్షించేందుకు బంగారు కవచాలు తొడుగుతారు. కవచాల మీదుగానే నిత్యాభిషేకాలు నిర్వహిస్తారు. ఏడాదికి ఒకసారి ఆ కవచాలను తొలగించి విగ్రహాలను శుభ్రం చేస్తారు. దీంతో స్వామివారు స్వయం తిరుమేని (నిజరూప దర్శనం)తో భక్తులకు దర్శనమిస్తారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి రోజుకో కవచం ధరింపజేస్తారు. మొదటి రోజు ముత్యాల కవచంతో అలంకరించారు. రెండో రోజు వజ్రకవచం ధరింపజేస్తారు. మూడవరోజు వజ్ర కవచం తీసి స్వర్ణ కవచం ధరింపచేస్తారు. మళ్లీ జ్యేష్టాభిషేకం వరకు స్వర్ణ కవచంలోనే స్వామివారు దర్శనమిస్తారు. ఈ పూజలు మఠం పీఠాధిపతి శ్రీ రంగరాజ యంత్రీంద్ర మాహాదేశికన్, ప్రధానార్చకులు వేణుగోపాలన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

మల్లన్నను దర్శించుకున్న ఎస్‌పీఎఫ్ డీజీ



ఎస్‌పీఎఫ్ డీజీ త్రివిక్రమ వర్మ దంపతులకు స్వాగతం పలుకుతున్న దేవస్థాన ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసు డైరెక్టర్ జనరల్ సి.ఎం.త్రివిక్రమ వర్మ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన డీజీ దంపతులకు ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. డీజీ దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద గల ఆశీర్వచన మండపంలో డీజీ దంపతులకు వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈఓ స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.

ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించండి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, అర్జీదారుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీదారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీదారులకు అధికారులు ఇచ్చిన ఎండార్స్‌మెంట్లు మొక్కుబడి రీతిలో ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. సమస్యకు కచ్చితమైన పరిష్కారం చూపడం లేదా పరిష్కరించకపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తూ అర్థమయ్యే రీతిలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. రీఓపెన్ అయ్యే దరఖాస్తులపై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయి విచారణకు సంబంధించిన ఫొటోలు అప్లోడ్ చేసే దాఖలాలే కనబడటం లేదన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో 7, రెవెన్యూలో 5, ల్యాండ్ అండ్ సర్వేలో 2, పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఒక దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఏలో ఉన్నాయని వీటన్నింటినీ క్లియర్ చేయాలని ఆదేశించారు. సచివాలయ సర్వీసులకు సంబంధించి సివిల్ సప్లయ్స్, పంచాయతీరాజ్, స్థానిక సంస్థలకు సంబంధించిన సమస్యలను ఎంపీడీఓలు విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన పిటిషన్‌లే అధికంగా ఉన్నాయని, మండల, డివిజన్ స్థాయిలో రెవెన్యూ అధికారులు చురుగ్గా పనిచేయాలని, వచ్చే వారం నుంచి రెవెన్యూ శాఖకు వచ్చే దరఖాస్తులు తగ్గుముఖం పట్టాలని సూచించారు. పరిష్కార వేదిక కార్యక్రమంలో 161 మంది అర్జీదారులు తమ సమస్యలపై వినతులు అందించారని, వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

చినుకులకే పరిమితం

కర్నూలు(అగ్రికల్చర్): ఆకాశం రోజూ మేఘావృతం అవుతున్నా వర్షం చినుకులకే పరిమితం అవుతోంది. ఒకటి, రెండు మండలాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నా మిగిలిన ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో వానలు పడినప్పటికీ జల్లులకే పరిమితమైంది. జిల్లా మొత్తం మీద సగటున 4.2 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదైంది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 22.9 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. అంటే 75 శాతం లోటు వర్షపాతం ఉంది. నెలలో పక్షం రోజులు గడిచినప్పటికీ వర్షాలు అంతంతమాత్రానికే పరిమితం కావడం పట్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్ మొదలై 45 రోజులు గడిచినా అత్తెసరు వర్షాలతో సాగులో పురోగతి కరువైంది.

మండలం	వర్షపాతం (మి.మీ)
కోసిగి	16.6
మంత్రాలయం	7.2
కౌతాలం	6.0
పెద్దకడుబూరు	5.4
ఎమ్మిగనూరు	5.2
కల్లూరు	5.2
పత్తికొండ	5.2

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని ఇన్‌చార్జ్ కలెక్టర్/జేసీ నారపురెడ్డి మౌర్య అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఇన్‌చార్జ్ కలెక్టర్, డీఆర్వో కె.మధుసూదన్‌రావు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా జిల్లా, మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువగా సదరం సర్టిఫికెట్లు, భూ వివాదాల సమస్యలపై అర్జీలు వస్తుండడంతో సంబంధిత అధికారులు బాధ్యతగా పనిచేయాలని, నిబంధనల మేరకు పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

- కర్నూలు నగరానికి సమీపంలో ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి కల్పించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు సుధాకరప్ప, నరసింహులు వినతిపత్రం ఇచ్చారు.

పొలం రాయించుకొని గెంటేశాడు

ప్రస్తుతం నా వయసు 80 ఏళ్లకుపైగానే ఉంటుంది. భర్త నీలకంఠేశ్వరుడు 23 ఏళ్ల క్రితం చనిపోయాడు. నా భర్త నుంచి వచ్చిన 13.85 ఎకరాల ఆస్తిని చిన్న కుమారుడు సురేష్ మోసం చేసి రాయించుకున్నాడు. ఈన్నాళ్లు నా పోషణను నేనే చూసుకునేదానిని. అప్పుడు ఏమీ చేతకావడం లేదు. ఆకలితో అలమటిస్తున్నా కుమారుడు పట్టించుకోవడంలేదు. పొలాన్ని నాకే ఇప్పించి న్యాయం చేయాలి.

– చెన్నమ్మ, ఏరూరు, చిప్పగిరి మండలం

నా పొలాన్ని నాశనం చేస్తున్నారు

నాకు రెండు కాళ్లు లేవు. వారసత్వంగా వచ్చిన 9.72 ఎకరాల్లో పంటలు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాను. గ్రామానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి దౌర్జన్యంగా నా పొలంలో వెళ్తూ పంటను నాశనం చేస్తున్నాడు. పొలంలో వెళ్లొద్దని చెబితే దాడికి తెగబడుతున్నాడు. ఈ విషయంపై గూడూరు ఎస్ఐ, ఏఎస్ఐ, ఎమ్మార్వోల దృష్టికి తీసుకెళితే పట్టించుకోవడంలేదు. ప్రత్యర్థులపై కేసు పెట్టడం లేదు. నాకు న్యాయం చేయాలి.

– ఉప్పర చంద్రమోహన్, గూడూరు

గుండమ్మ హత్యకేసు నిందితుల అరెస్ట్

- ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠిన చర్యలు : డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో ఈనెల 12వ తేదీన మాదిగ గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపిన కేసులో నిందితులు అదే గ్రామానికి చెందిన జడ్ల శ్రీధర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, హెబ్బటం రామకృష్ణ, దాసరి గోవిందరాజును సిరుగుప్ప క్రాస్ రోడ్డులో అరెస్టు చేసినట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఆయన సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ఈనెల 12న నాగనాథనహళ్లి గ్రామంలో రామచంద్రారెడ్డి అనే వ్యక్తి పొలంలో బండి రస్తా విషయంలో తగదా ఏర్పడగా మాదిగ గుండమ్మ (49)ను నిందితులు ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశారన్నారు. అలాగే ఆమె సన్నిహితుడైన పురుషోత్తంరెడ్డిపై కర్రతో దాడి చేసినట్లు చెప్పారు. ఘటనపై గుండమ్మ కుమారుడు ఎస్.కిషోర్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదోని రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గ్రామ రెవెన్యూ వివరాల ప్రకారం సదరు 4 ఎకరాల పొలాన్ని తిరుమలమ్మ, సోమశేఖర్‌రెడ్డి దంపతుల నుంచి మాదిగ గుండమ్మ 2019లో కొనుగోలు చేసిందన్నారు. 2022లో ఆమె కుమారుడు ఎస్.కిషోర్‌కుమార్ పేరిట రిజిస్ట్రేషన్ చేయించినట్లు చెప్పారు. ఈ భూమి విషయంలో గతంలో తిరుమలమ్మ, రాఘవేంద్రరెడ్డి అనే వ్యక్తి మధ్య వివాదం ఉండగా ఆదోని సివిల్ కోర్టులో కేసు నడుస్తోందన్నారు. కొనుగోలు చేసిన నాటి నుంచి పొలాన్ని సాగుచేసుకుంటూ వస్తున్న గుండమ్మ ఈ నెల 12న కుమారుడు కిషోర్, కల్లుబావికి చెందిన పురుషోత్తంరెడ్డితో కలిసి పొలంలో ట్రాక్టర్‌తో ఉండగా నాగనాథనహళ్లికి చెందిన రాఘవేంద్రరెడ్డి, అతని కుమారుడు శ్రీధర్‌రెడ్డి, మరో నలుగురు వ్యక్తులు ట్రాక్టర్‌లో వచ్చి సదరు భూమిలో తమకు కూడా వాటా ఉందని, తాము కూడా దున్నుతామని గుండమ్మతో గొడవకు దిగారు. శ్రీధర్‌రెడ్డి ఆవేశంలో గుండమ్మను ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశారని, రాఘవేంద్రరెడ్డి కర్రతో పురుషోత్తంరెడ్డిపై దాడి చేసినట్లు చెప్పారు. ఈ కేసులో నిందితుల కోసం గాలింపు చేపట్టి సోమవారం ఉదయం 11 గంటల సమయంలో సిరుగుప్ప క్రాస్ రోడ్డు వద్ద ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. హత్యకు ఉపయోగించిన ట్రాక్టర్, కర్రను సిరుగుప్ప క్రాస్ సమీపంలోని ముళ్ల పొదల్లో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రైనీ డీఎస్పీ ధీరజ్, సీఐలు నిరంజన్‌రెడ్డి, మంజునాథ్, ఎస్ఐలు శ్రీనివాసులు, చిన్నపీరయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులకు కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ కె.పుష్పకుమార్ తెలిపారు. 30 రోజుల శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు, చదవడం, రాయడం వచ్చిన యువకులు అర్హులని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు 63044 91236 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో వారాహి పూజలు



కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం వారాహీ నవరాత్రులను పురస్కరించుకొని స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి పూజ, మండపారాధన, శ్రీదేవి ఖడ్గమాల, లలితా సహస్రనామార్చనలు, సామూహిక కుంకుమార్చనలు, ప్రదోష కాల అర్చన పాదుకానుష్టాన అర్చన, వారాహి సహస్ర నామార్చనలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి.

20 వరకే పత్తి సాగుకు అవకాశం

కర్నూలు(అగ్రికల్చర్): పత్తి సాగుకు ఈ నెల 20 వరకు మాత్రమే అవకాశం ఉందని నంద్యాల ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్త శివరామకృష్ణ తెలిపారు. పత్తి విత్తిన 10 రోజుల్లో మొలకలు రానిచోట విత్తనాలు నాటుకోవాలని, రెండు మొలకలు ఉన్నచోట ఒకటి పెరికివేయాలని, కుదురుగా ఒక మొక్క ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పంటలో మొదటి 45 రోజుల నుంచి 60 రోజుల వరకు కలుపు లేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

- కలుపు నివారణకు విత్తనం వేసిన 24 నుంచి 48 గంటల్లోపు పెండిమిథాలిన్ 30 శాతం లేదా.. అలాకోర్ 50 శాతం 1.5 – 2.0 లీటర్లకు 200 లీటర్ల నీరు కలిపి నేలపై పిచికారీ చేయాలన్నారు.
- భూమిలో తగిన తేమ ఉన్నప్పుడు పిచికారీ చేసినట్లయితే కలుపు మందు సమర్థవంతంగా పనిచేసి 20 రోజుల వరకు కలుపు మొక్కలు లేకుండా చేస్తుందన్నారు.
- పంట నెల రోజుల దశలో ఉన్నప్పుడు పొలంలో సన్న ఆకుల గడ్డి, వెడల్పాకు కలుపు నివారణకు క్విజలోఫాస్ ఇథైల్, 400 మి.లీ, లేదా ప్రొపాక్విజాఫాప్ 250 మి.లీ, లేదా పైరిథయోబ్యాక్ సోడియం 6 శాతం+ క్విజలో ఫాప్ ఇథైల్ 4 శాతం, ఎంఐసీ 500 మి.లీ 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.
- ఎకరాకు 110 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేటు, లేదా 50 కిలోల డీఏపీ, 40 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్‌కలిపి 4 సార్లు వేసుకోవాలని తెలిపారు.
- భాస్వరం ఎరువు మొత్తాన్ని దుక్కిలో లేదా విత్తిన 15 రోజుల్లోపు వేసుకోవాలన్నారు.
- పత్తి వేసిన 20, 40, 60, 80 రోజుల్లో 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి 4 సార్లు వేసుకోవాలి.
- పైపాటుగా డీఏపీ లేదా కాంప్లెక్స్ (20-20-0-13) ఎరువులను జూలై తర్వాత వాడరాదన్నారు.
- పత్తి పంట బెట్టకు లేదా అధిక వర్షాలకు గురైనప్పుడు పంట పెరుగుదలకు 19-19-19 లేదా 13-0-15 లాంటి పోషకాలను లీటరు నీటికి 10 గ్రాముల చొప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు.
- అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసిన రైతులు 45-50 రోజుల దశలో ఉన్నప్పుడు తప్పకుండా మెపిక్వాట్ క్లోరైడ్ మందును లీటరు నీటికి 1.2 మి.లీ ప్రకారం కలుపుకొని పిచికారీ చేసుకోవాలని తెలిపారు.
- పంట మొదటి 30-45 రోజుల్లో రసం పీల్చే పురుగుల నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు, లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ, లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు లేదా థయోమిథాక్సమ్ 0.2 గ్రాములు, లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ లీటరు నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలని సూచించారు.
- పత్తిలో మొక్కలు సామూహికంగా చనిపోతే వేరుకుళ్లుగా భావించి కార్బండాజిమ్ 1 గ్రాము లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల చుట్టూ వేరు బాగా తడిచే విధంగా పోసకోవాలన్నారు.
- మరిన్ని వివరాలకు 89194 06382 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- మద్యం అలవాటు మానుకుంటేనే కాపురానికి వస్తానని భార్య చెప్పడంతో అఘాయిత్యం

మహానంది: మద్యం మానేస్తేనే కాపురానికి వస్తానని భార్య తేల్చి చెప్పడంతో జీవితం విరక్తి చెంది వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బండిఆత్మకూరు మండలం జి.లింగాపురం గ్రామానికి కుంచపు గోకారి (46) నిత్యం మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో బాధలు పడలేక భార్య శివలక్ష్మీ మూడు నెలల క్రితం అదే గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. భర్త కాపురానికి రమ్మని కోరగా మద్యం అలవాటు మానుకుంటేనే వస్తానని తేల్చిచెప్పింది. దీంతో మనస్తాపానికి గురైన భర్త కుంచపు గోకారి సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. మృతుడు గోకారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.